సాక్షి
అన్నమయ్య జిల్లా
ఆదివారం । 5 । ఫిబ్రవరి । 2023



క్రీడలతో మానసికోల్లాసం
కడప డీఎస్‌ఏ క్రీడామైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. -8లో..



ఏజెంట్లు బాధ్యతగా వ్యవహరించాలి
అన్ని వివరాలు సక్రమంగా ఉన్నవారినే విదేశాలకు పంపాలని ట్రావెల్ ఏజెంట్లకు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సూచించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.134	రూ.180
రెండోరకం	రూ.80	రూ.130

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 177 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సేవలు



బాలామృతం, కోడిగుడ్లు అందిస్తున్న పీడీ ధనలక్ష్మి, సీడీపీఓ సుజాత తదితరులు

మదనపల్లె : అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు మెరుగైన సేవలందించాలని పీడీ ధనలక్ష్మి ఆదేశించారు. శనివారం మదనపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని సీటీఎం సెక్టార్ గంగాపురం, సీటీఎం అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ సుజాతతో కలిసి తనిఖీ చేశారు. కేంద్రాల్లో ప్రి స్కూల్ యాక్టివిటీస్‌కు సంబంధించి పీపీ-1, పీపీ-2 బుక్స్ చూశారు. మహిళలు, చిన్నారుల్లో రక్తహీనత, పోషకాహార లోపాలను నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషకాహారం, జగనన్న గోరుముద్ద తదితర పౌష్టికాహారం, కోడిగుడ్లను సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. అనీమియా బాధితులు ఒక్కరూ లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఆన్‌లైన్ యాప్స్ గురించి సిబ్బందితో మాట్లాడారు.

అమృత్ సరోవర్‌తో చెరువుల అభివృద్ధి



మాట్లాడుతున్న పీడీ మద్దిలేటి

నిమ్మనపల్లె: అమృత్‌సరోవర్ పథకంలో భాగంగా ఉపాధిహామీ నిధులతో చెరువుల అభివృద్ధి చేయనున్నట్లు ఉపాధిహామీ ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి అన్నారు. శనివారం మండల పరిధిలోని రెడ్డివారిపల్లె పంచాయతీ చలిమామిడి చెరువులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఏపీడీ మధుబాబుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా 56 చెరువుల్లో అభివృద్ధి పనులను ముమ్మరంగా చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా చెరువులకు అనుసంధానమైన సప్లయి ఛానల్స్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధిహామీ సిబ్బంది క్షేత్రస్థాయిలో కూలీలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా జగనన్న పక్కాగృహాల నిర్మాణానికి సంబంధించిన ఉపాధిహామీ బిల్లులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కూలీల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ లీలా మాధవి, సర్పంచ్ రెడ్డెమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు నరేంద్రరెడ్డి, ఉపాధిహామీ ఏపీఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూకు నిధుల కళ

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో మౌలికవసతులు ఏర్పాటుకు రూ. 6 కోట్లు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. నూతనంగా ఏర్పాటైన విశ్వవిద్యాలయంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు నిధులను విడుదల చేశారు.

- 2021 డిసెంబర్ 29న నిర్వహించిన 4వ ఎం అండ్‌డీసీ సమావేశంలో విశ్వవిద్యాలయంలో 28 ల్యాబ్‌ల ఏర్పాటుకు అంగీకారం తెలిపారు. ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విభాగానికి 28 ల్యాబ్‌లు, ఫైన్‌ఆర్ట్స్ విభాగానికి 24 ల్యాబ్‌లను ఏర్పాటు చేసేందుకు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దీంతో మొత్తం 52 ల్యాబ్‌ల ఏర్పాటు చేసేందుకు దానికి సంబంధించిన మెటీరియల్ కొనుగోలు చేసేందుకు నిధులు విడుదల చేశారు. ప్రభుత్వం విశ్వవిద్యాలయంకు నిధులు కేటాయించడం పట్ల ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఫజుల్ రెహమాన్, రిజిస్ట్రార్ ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కృషిచేసిన ఎంపీ అవినాష్‌రెడ్డికి, జిల్లా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

రేవతి.. చైతన్య స్రవంతి!

- ఇంజినీరింగ్ చదువుతూ..
- రుతుక్రమ శుభ్రత.. బాల్య వివాహాలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తూ..
- సామాజిక బాధ్యతను మోస్తున్న రేవతి



రుతుక్రమంపై పాఠాలు చెబుతున్న విద్యార్థి రేవతి (ఇన్‌సెట్) రేవతి

మదనపల్లె సిటీ: యుక్తవయస్సు రాగానే విద్యార్థుల్లో మార్పులు చోటు చేసుకుంటాయి. ప్రధానంగా బహిష్టు కావడం జరుగుతుంది. ఈ సమయంలో కిషోర బాలికలు తీవ్ర ఇబ్బందులు పడతారు. వారికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సరైన సూచనలు ఇవ్వకపోవడంతో వారు పడరానిపాట్లు పడుతున్నారు. ఇలాంటి కిషోర బాలికలకు నేనున్నాంటూ నడుం బిగించింది రేవతి అనే విద్యార్థిని. పాఠశాలకు వెళ్లి రుతుక్రమ శుభ్రత (మెన్‌స్ట్రువల్ హైజీన్)పై పాఠాలు చెబుతుంది. ఏంది.. ఆ పిల్లా అలా చెబుతుంది..? మా గురించి ఈ పాపకు ఏంపని? ఇలా కనబడిన వాళ్లంతా కామెంట్లు. అబ్బాయిలైతే మరి.. చెప్పలేని మాటలు...ఇలా జరిగినా ఆ విద్యార్థిని కుంగిపోలేదు. ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేసింది. వందలాది బడుల్లో వేలాది మందికి పాఠాలు చెబుతుంటుంది. ఇంతకి ఆ విద్యార్థి ఏం పాఠాలు చెబుతుంది.. ఎందుకు చెబుతుంది.. వివరాలు తెలుసుకోవాలంటే ...

వల్లిగట్ల రేవతి ఇంజినీరింగ్ చదువుతోంది. చైల్డ్ రైట్స్ అండ్ యూ (క్రై) సంస్థలో సభ్యురాలు. ఇది ప్రపంచ వ్యాప్తంగా పిల్లల హక్కుల కోసం పాటుపడుతున్న సంస్థ. మదనపల్లెలో ఆ సంస్థ సాయంతో నడుస్తున్న పీపుల్స్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఫోర్డ్)లో రేవతి రిసోర్స్‌పర్సన్. ఇందులో భాగంగా బాల్యవివాహాలని ముందుగా పసిగట్టి ఆపడం, బాలకార్మికులని బడిలో చేర్పడం ఆమె విధి. అలా ఇప్పటివరకూ పది దాకా బాల్యవివాహాలు ఆపింది. పదిహేనుమంది పిల్లల్ని బడిలో చేర్పించింది. అంతేకాదు, పల్లెల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు రుతుక్రమ శుభ్రత(మెన్‌స్ట్రువల్ హైజీన్)పై పాఠాలు చెబుతుంది.

ఫోర్డ్ బృంద సభ్యుల పాఠాలతో నాలో మార్పువచ్చింది

మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలో రేవతి పదో తరగతి చదువుతున్న సమయంలో ఫోర్డ్ బృంద సభ్యులు పాఠశాలకు వెళ్లారు. వారు బాల్యవివాహాలు, విద్య ,ఆరోగ్యం గురించి వివరించారు. వారు చెప్పిన విషయాలకు రేవతి బాగా ఆకర్షితులయ్యారు. ఆ తర్వాత తల్లిదండ్రులను ఒప్పించి ఫోర్డ్ నిర్వహించిన శిక్షణకు వెళ్లింది. అప్పటి నుంచి సభ్యురాలిగా చేరింది.

పాఠశాలలో తరగతులు.. బాల్యవివాహాలు అడ్డుకుంటూ...

ఒకవైపు చదువుకుంటూ మరో వైపు పాఠశాలకు వెళ్లి రుతుక్రమశుభ్రతపై వివరిస్తున్నారు. అమ్మాయిల్లో పన్నెండేళ్ల తర్వాత వచ్చే మార్పులు గురించి చెబుతున్నారు. మురికివాడల్లో కాగితాలు ఏరుతూ బతుకుతున్న 20 మంది బాలలను బ్రిడ్జ్, కేజీబీవీల్లో చేర్పించింది. బాల్యవివాహాలు జరుగుతున్న విషయం తెలిస్తే చాలు వారి తల్లిదండ్రులకు వివరంగా నచ్చచెబుతుంది. ఇలా రేవతి ముందుకు సాగుతోంది.

అందరికి ఆరోగ్యం కోసం

మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థినులు చాలామందికి రుతుక్రమ శుభ్రత(మెన్‌స్ట్రువల్ హైజీన్) పై అవగాహన లేదు. ఇలాంటి వారికి స్వయంగా వారి సమస్యలు తెలుసుకుని తెలిజేయాలన్నదే నా ధ్యేయం. రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్యాడ్స్ గురించి అందరికి తెలియజేయడం నా కర్తవ్యం. ఇప్పటికే పలు పాఠశాలల్లో తెలియజేశాను. అందరికి తెలియజేసి ఆరోగ్యవంతులు చేయాలన్నదే నా లక్ష్యం. -వల్లిగట్ల రేవతి, విద్యార్థిని, మదనపల్లె

సహకార బోధనతో మెరుగైన ఫలితాలు

- జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి



సంబేపల్లె లో సహకార బోధన పద్ధతిపై ఉపాధ్యాయులకు వివరిస్తున్న డీఈఓ రాఘవరెడ్డి

సంబేపల్లె : విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు సహకార బోధన పద్ధతి చక్కగా తోడ్పడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి తెలిపారు. శనివారం సంబేపల్లె మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సహకార బోధన పద్ధతిని ఆయన ప్రారంభించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విధానంలో ఉపాధ్యాయుడు తాను బోధించగలిగే అంశాలను చక్కగా బోధించగలరన్నారు. ఈ విధానాన్ని ఉపాధ్యాయులంతా అమలు పరచగలిగితే విద్యార్థులకు గరిష్ట ప్రయోజనం చేకూరుతుందన్నారు. అంతేకాకుండా ఉపాధ్యాయులు కూడా బోధన మెలకువలను తెలుసుకోవచ్చన్నారు. ఈ విధానం సంబేపల్లెలో విజయవంతం అయిన తర్వాత జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో అమలు జరుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదర్శపాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమూల్ పాలసేకరణ 70 శాతం జరగాలి

- ప్రభుత్వ ప్రోత్సాహకాలపై పాడి రైతులకు అవగాహన అవసరం
- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా

రాయచోటి: జిల్లాలో 70 శాతం మేర అమూల్‌కు పాలసేకరణ జరగాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, జగనన్న పాలవెల్లువ ఆర్‌బీసీలు, మెంటర్స్‌తో జగనన్న పాల వెల్లువ కార్యక్రమం, అమూల్‌కు పాలసేకరణపై జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్నమయ్య జిల్లాలో 12,871 మంది రిజిస్టర్ అయిన పాడి రైతులు ఉన్నారన్నారు. వీరిలో 70 శాతం పాడి రైతులు జగనన్న పాలవెల్లువ అమూల్ కేంద్రాలకు పాలు పోసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ ప్రోత్సాహకాల గురించి పాడి రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, డ్వాక్రా మహిళలు, ప్రజాప్రతినిధుల సహకారంతో పాలవెల్లువ ప్రాముఖ్యతను పాడి రైతులకు తెలియజేయాలన్నారు. అమూల్‌కు పాలు పోసే విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుతం అమూల్‌కు పాలు పోసే వారికి ఒక లీటర్‌కు రూ.35 నుంచి రూ.40 వరకు డబ్బులు ఇస్తున్నామన్నారు. ఫిబ్రవరి 11వ తేదీ నుంచి పాల ధర పెంచనున్న విషయం పాడి రైతులకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, పశుసంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్‌పిళ్లై, కడప జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది తప్పనిసరిగా ముఖ ఆధారిత హాజరు వేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో వైద్యశాఖ అధికారులతో ముఖ ఆధారిత హాజరు, హైరిస్క్ ప్రెగ్నెన్సీ బర్త్ ప్లానింగ్, 10-19 సంవత్సరాల బాలబాలికలకు వైద్య పరీక్షలు, అనీమియా, ఫ్యామిలీ ఫిజీషియన్ అమలు, తదితర పలు అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే బాధితులకు బాధ్యతగా వైద్య సేవలు అందించి, రోగులకు భరోసా కల్పించాలన్నారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీలను గుర్తించడంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. నెలాఖరుకు అనీమియా వందశాతం పరీక్షలు జరగాలన్నారు. సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, గురుకులాలలో వైద్యాధికారులు విజిట్ చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలన్నారు. జిల్లాలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పక్కాగా అమలు కావడంతోపాటు ఓపీ సంఖ్య మరింత పెంచాలన్నారు. ఈ సమీక్షలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

▶▶ జగనన్న ఇళ్ల నిర్మాణంలో పురోగతి కనిపించాలి



కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

రాయచోటి అర్బన్: రాయచోటి పట్టణం నారాయణరెడ్డిపల్లె జగనన్న కాలనీ లే అవుట్‌లోని ఇళ్ల నిర్మాణంలో వచ్చే వారంలోపు పురోగతి కనిపించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. శనివారం రాయచోటి అర్బన్ పరిధిలోని నారాయణరెడ్డిపల్లె జగనన్న కాలనీ లేఅవుట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను శనివారం కలెక్టర్ పరిశీలించారు. గోడౌన్‌లో ఎన్నిబస్తాల సిమెంటు నిల్వ ఉంది ? ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే ఇతర నిర్మాణ సామగ్రి వివరాలను హౌసింగ్ పీడీ శివయ్యను అడిగి తెలుసుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో నీళ్ల రావడం లేదని లబ్ధిదారులు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

దీనిపై స్పందించిన కలెక్టర్ కాలనీలో ఇళ్ల నిర్మాణానికి నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాంబాబును ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ చంద్రశేఖరరెడ్డితో పాటు మున్సిపల్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కీర్తి న్యూరోలో విజయవంతంగా పక్షవాత చికిత్స



చికిత్స తీసుకున్న శాంతమ్మతో డాక్టర్ కీర్తి

తిరుపతి తుడా : తిరుపతి – కరకంబాడి రోడ్డులోని కీర్తి న్యూరో అండ్ ఎమర్జెన్సీ ఆస్పత్రిలో మహిళ(80)కు పక్షవాత చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్టు డాక్టర్ కీర్తి తెలిపారు. శ్రీకాళహస్తికి చెందిన కె.శాంతమ్మకు రెండోసారి పక్షవాతం తీవ్రస్థాయిలో రావడంతో అత్యవసర చికిత్స కోసం చేర్పించారని తెలిపారు. దీంతో ఆమె గంటలోనే పూర్తిగా కోలుకున్నారని పేర్కొన్నారు. లక్షణాలు ఎవరికైనా ఉంటే ముందస్తు చికిత్స తీసుకోవడం వల్ల వ్యాధిని పూర్తిస్థాయిలో నయం చేసుకోవచ్చన్నారు. పక్షవాతం సోకిన గంటలోపు చికిత్స తీసుకుంటే పూర్తిగా వ్యాధి నుంచి కాపాడవచ్చని వివరించారు.

దీనులను ఆదుకునే తల్లి లూర్దుమాత



లూర్దుమాత స్వరూపాన్ని ఊరేగిస్తున్న విశ్వాసులు

కడప కల్చరల్ : లూర్దుమాత దీనులను ఆదుకునే తల్లి మరియాపురంకు చెందిన అభిషేకింపబడిన గురువులు పేర్కొన్నారు. లూర్దుమాత తిరునాల మూడోరోజు శనివారం జరిగిన ఆధ్యాత్మిక సభలో వారు ప్రసంగించారు. దీనులైన వారిని తల్లిగా మరియమాత దయతో ఆదరిస్తోందని, ప్రభువైన, లోకరక్షకుడైన ఏసుక్రీస్తు ద్వారా ఆమె దీనత్వం గల వారికి దైవం పక్షాన రక్షణ కల్పిస్తోందని పేర్కొన్నారు. విశ్వాసుల దీనత్వాన్ని చూసి ఆమె తన కుమారుడైన ఏసుక్రీస్తును లోకానికి పంపారని సెయింట్ జోసెఫ్స్ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి కారు శరత్ అన్నారు. అనంతరం ఫాదర్ అమృత్‌కుమార్ సమష్టిదివ్య బలిపూజ సమర్పించారు. విచారణ గురువులు బిరుసు రాజా, చంద్ర, తిరునాల కమిటీ అధ్యక్షులు వారాది జోసెఫ్, ఉపాధ్యక్షులు పుల్లగుజ్జు విజయ్ కుమార్, కార్యదర్శి పుల్లగూర లూర్దు, ట్రెజరర్ యు.విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్లు బాధ్యతగా వ్యవహరించాలి

- విదేశాలకు వెళ్లినవారు ఇబ్బంది పడకూడదు
- అన్ని పేపర్లు సక్రమంగా ఉంటేనే పంపాలి
- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రాయచోటిటౌన్ : జీవనోపాధి కోసం విదేశాలకు వెళ్లే వారికి సంబంధించిన పేపర్లు సక్రమంగా ఉంటేనే పంపాలని ట్రావెల్ ఏజెంట్లకు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సూచించారు. శనివారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని ఎస్పీ కార్యాలయంలో ట్రావెల్ ఏజెంట్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాధితులతో మాట్లాడి వారు విదేశాల్లో ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి తెలుసుకున్నారు. విదేశాలకు వెళ్లాలనుకునే వారు మీ వద్దకు వచ్చిన సమయంలో వారి వద్ద అన్ని పత్రాలు (ఎమిగ్రేషన్, అగ్రిమెంట్, వీసా, మెడికల్ పేపర్లు) ఉంటేనే పంపేందుకు ప్రయత్నించాలని చెప్పారు. విదేశాల్లోనే ప్రాణాలు కోల్పోయిన వారుకొందరు, జైళ్లలో మగ్గుతున్న వారు మరికొందరు, ఇంటికి రాలేక అక్కడే మగ్గుతున్నవారు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అలాంటి వారి బంధువులు, కుటుంబ సభ్యులు తమ వాళ్లను స్వదేశానికి తీసుకరావాలని కోరుతూ మా కార్యాలయానికి వస్తున్నారని చెప్పారు. అందుకే ఏజెంట్లు మానవతా దృక్పథంతో, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.చట్టవిరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.



సమావేశానికి హాజరైన ఏజెంట్లతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

పనికి కుదిరింది ఓ చోట.. చేసింది మరోచోట



నేను జీవనోపాధి కోసం దుబాయికి వెళ్లాను. అక్కడ ఏజెంట్ ఒక యజమానురాలుకి అప్పగించాడు. ఆమె నాకు అకామా (పర్మిషన్) ఇవ్వకుండా ఆరు నెలలు పని చేయించుకుంది. ఈ మధ్య కాలంలో యజమానిరాలు నాకు ముద్ర వేయకుండా తిరిగి మరొకరికి అప్పగించింది. ఇదేమని అడిగితే నీ కోసం రూ.1,50,000లు ఖర్చు చేశానని, ఆ డబ్బులు ఇస్తే నీకు అకామా ఇస్తానని చెప్పింది. వద్దని వారిస్తే ఇంటిలో నుంచి వెళ్లగొట్టింది. నా దగ్గర ఉన్న జీతం డబ్బులతో ఇండియన్ ఎంబసీకి వెళ్లి అక్కడి నుంచి ఇండియా వచ్చాను. – పెంచలమ్మ, బాధితురాలు

మా అమ్మ జాడ కూడా చెప్పలేదు



మా అమ్మ మస్కట్‌కు వెళ్లింది. అక్కడికి వెళ్లిన తరువాత ఆరోగ్యం బాగా లేదని చెప్పారు. ఆమెను ఇంటికి తీసుకరావాలని ఏజెంట్‌ను కోరాం. ఎలాంటి సమాధానం లేదు. నెల రోజుల నుంచి మా అమ్మ గురించి ఎలాంటి సమాచారం లేదు. చివరిగా మా అమ్మ చనిపోయిందని చెప్పారు. ఆమె మృతదేహాన్ని కూడా ఇప్పటి వరకు తీసుకరాలేదు. – బాధితురాలి కుమారుడు షణ్ముక, పీలేరు.

గుర్తింపు ఉన్న ఏజెంట్ల ద్వారా వెళ్లాలి



ఈ ప్రాంతం నుంచి జవనోపాధి కోసం విదేశాలకు వెళ్లే వారు అన్ని అర్హతలు ఉండి గుర్తింపు పొందిన ఏజెంట్ల ద్వారా వెళ్లడం మంచిది. అలా వెళితే విదేశాల్లో కూడా ఆర్ఐ ఏజెంట్లు ఉంటారు. వారి ద్వారా ఉద్యోగం లభిస్తుంది. విదేశీ యజమాని దగ్గర ఆరు నెలల వ్యవధిలో ఇద్దరిలో ఏ ఒక్కరికి నచ్చకపోయినా ఆఫీస్‌కు అప్పగిస్తారు. తద్వారా మంచి జరుగుతుంది.కొందరు విజిట్ వీసాల ద్వారా కూడా వెళుతున్నారు. అక్కడికి వెళ్లిన తర్వాత వారికి అనుకూలంగా మార్చుకొని ఉద్యోగం ఇస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లో కొందరు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. – ఎస్‌కె హుస్సేన్, ఏజెంట్, రాయచోటి.

అగ్నిప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

మదనపల్లె : పొయ్యి వద్ద వంట చేస్తుండగా జరిగిన ప్రమాదంలో వివాహిత తీవ్రంగా గాయపడిన సంఘటన పీటీఎం మండలంలో శుక్రవారం జరిగింది. కాట్నగల్లు గ్రామానికి చెందిన అంజనప్ప భార్య పి.రత్నమ్మ(30) గత కొన్ని రోజులుగా మూర్ఛ వ్యాధితో బాధపడుతోంది. కూలీ పనులు చేస్తూ అవ్వ కదిరమ్మతో కలిసి జీవిస్తోంది. ఇంటి వద్ద వంట చేస్తుండగా ఆకస్మాత్తుగా మూర్ఛవ్యాధికి గురై పొయ్యి మంటల్లో పడి తీవ్రంగా గాయపడింది. బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పేకాట స్థావరంపై దాడి

– రూ.5.96లక్షల నగదు స్వాధీనం

కలికిరి : పేకాట స్థావరంపై దాడి చేసి 19 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు వాల్మీకిపురం ఇన్‌చార్జి సీఐ నాగేంద్ర తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కలికిరి–వాల్మీకిపురం మండలాల సరిహద్దు అటవీప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా పేకాట ఆడుతున్న 19 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5.96లక్షలు నగదు, 21 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రైళ్లు ఆపాలని విద్యార్థుల ర్యాలీ

నందలూరు(ఒంటిమిట్ట) : జిల్లాలో రైల్వే పరంగా ప్రసిద్ధి చెందిన నందలూరు రైల్వే కేంద్రంలో వెంకటాద్రి, రాయలసీమ, చెన్నై రైళ్లను నిలుపుదల చేయాలని నందలూరు సెయింట్ జోసఫ్ ఇంగ్లిషు మీడియం స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్.. తిరుపతి ఎమ్మెల్యే సోదరుడు భూమన శివశంకర్ రెడ్డి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ ముందు ఇక్కడ అన్ని రైళ్లు ఆగేవి అన్నారు. ఇప్పుడు ఏ రైలు ఆగకుండా రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయం పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెల్లుబుకుతోందన్నారు. నందలూరు సౌమ్యనాథ ఆలయానికి జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు వస్తున్నారన్నారు. వారు రైలు ప్రయాణం ద్వారా నందలూరు చేరుకోవడానికి వీలు లేకుండా పోయిందన్నారు.అందువల్ల అధికారులు తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు పాల్గొన్నారు. శనివారం పాటూరు పంచాయతీ ఎగువ కుమ్మర పల్లె గ్రామం రామాలయం వద్ద నందలూరులో రైళ్ల స్టాపింగ్ కోసం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్ అతిథులుగా హాజరయ్యారు. సంతకాల సేకరణ కార్యక్రమంలో ఐకేపీఎస్ నాయకులు పోతురాజు మస్తానయ్య, అభిషేక్, గుండు జనార్ధన్‌రెడ్డి, మహిళలు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



విద్యార్థులు చేపట్టిన ర్యాలీని ప్రారంభిస్తున్న భూమన శివశంకర్‌రెడ్డి

గిరి ప్రదక్షణకు అనుమతించండి

కడప కల్చరల్ : పుష్పగిరి క్షేత్రంలో గిరి ప్రదక్షణకు అనుమతించాలని శ్రీరామరాజ్యం, హిందూత్వ చైతన్యవేదిక ప్రతినిధి న్యాయవాది సట్టి భారవి అధికారులను కోరారు. ఇటీవల తాము పుష్పగిరిలో పూర్వం కొనసాగినట్లు గిరి ప్రదక్షణను పునః ప్రారంభించాలని పుష్పగిరి పీఠాధిపతిని కోరామని, ఆయన అందుకు సమ్మతించారని తెలిపారు. ఈ సంవత్సరం గిరి ప్రదక్షిణను మార్చి 1న నిర్వహించాలని ఆయనే స్వయంగా ముహూర్తం నిర్ణయించినట్లు చెప్పారు. ఈ మేరకు ముహూర్తపు పత్రాలను ఎర్రముక్కపల్లె శ్రీ మారెమ్మ ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ఈ లేఖను జిల్లా దేవదాయశాఖ అధికారులకు సమర్పిస్తున్నామన్నారు. గిరి ప్రదక్షణ గురించి పుష్పగిరి పీఠాధిపతితో చర్చించి మార్చి 1న శాఖాపరంగా అన్ని ఏర్పాట్లు చేయాలని కోరుతున్నామన్నారు.



గిరి ప్రదక్షణ ముహూర్త పత్రాన్ని ప్రదర్శిస్తున్న భారవి తదితరులు

పట్టు పరిశ్రమతో అధిక లాభాలు



సిద్దవటంలోని పట్టుపురుగుల షెడ్డును పరిశీలిస్తున్న పట్టు పరిశ్రమశాఖ అడిషనల్ డైరెక్టర్ అరుణకుమారి

సిద్దవటం : మండలంలోని సిద్దవటం..మోదీన్‌సాబ్ పల్లె గ్రామాల్లో ఉన్న పట్టు పరిశ్రమ షెడ్లను, మల్బరీ పంటలను శనివారం పట్టుపరిశ్రమల శాఖ అడిషనల్ డైరెక్టర్ అరుణకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ఆర్ జిల్లాలో దాదాపు 1000 ఎకరాల్లో మల్బరీ పంట సాగు చేస్తున్నారన్నారు. రైతులకు ఇది లాభసాటిగా ఉంటుందన్నారు. పట్టు పరిశ్రమ ద్వారా ఎకరాకు రూ.1,50,000 నుంచి రెండు లక్షల రూపాయల వరకు ఆదాయం వస్తుందని అన్నారు. పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువ అని ఆమె అన్నారు. మండలం లోని మోదీన్‌సాబ్‌పల్లె, సిద్దవటం గ్రామాల్లో రైతులు చెన్నారెడ్డి, హరిలకు సూచనలు, సలహాలు ఇచ్చారు.కార్యక్రమంలో డీడీ షాహిదాబేగం, అన్నమయ్య జిల్లా డీడీ రాజశేఖర్‌రెడ్డి, కడప పట్టు పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాసులరెడ్డి, గుటూరు జిల్లా పట్టుపరిశ్రమల అధికారులు సుధాకర్, వెంకటరామరాజు రైతులు చెన్నారెడ్డి, హరి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డా. వల్లూరు బ్రహ్మయ్య

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. ఈ పోటీల ప్రారంభోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథులుగా జిల్లా మైనార్టీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ విచ్చేసి ఎంపికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం ద్వారా యువత మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసికోల్లాసం పొందొచ్చన్నారు. నెహ్రూయువకేంద్రం జిల్లా సమన్వయకర్త మణికంఠ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని పలు బ్లాక్‌ల పరిధిలోని పోటీలు నిర్వహించామని తెలిపారు. అనంతరం సాయంత్రం నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి సమగ్రశిక్ష అభియాన్ అధికారి ఎ. ప్రభాకర్‌రెడ్డి విచ్చేసి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతి కడప మరియాపురం జట్టు గెలుపొందగా, ద్వితీయ బహుమతి రాయచోటి జట్టు నిలిచింది. కార్యక్రమంలో డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృతరాజ్, కోచ్‌లు పాల్గొన్నారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

– ఒకరికిగాయాలు



గాయపడిన చైతన్యకుమార్

మదనపల్లె : వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు తీవ్రంగా గాయపడ్డారు. కడపజిల్లా పొద్దుటూరుకు చెందిన చైతన్యకుమార్(25) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చి తిరిగి శనివారం ద్విచక్రవాహనంలో బెంగళూరుకు పయనమయ్యాడు. గుర్రంకొండ వద్ద రోడ్డు పక్కన ఆపి ఉంచిన ట్రాక్టర్‌ను ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు బాధితుడిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకు బెంగళూరుకు తరలించారు.

వాహనం అదుపుతప్పి..

పెద్దమండ్యం మండలం కలిచెర్లకు చెందిన ఫకృద్దీన్ కుమారుడు షేక్ సయ్యద్ షావలీ(30) ఇటీవలే కొత్త ఆక్టివా వాహనం కొన్నాడు. సర్వీసింగ్ చేయించేందుకు శనివారం వాహనంలో రాయచోటికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా పెద్దమండ్యం వద్ద వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాధితుడ్ని కుటుంబసభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పెద్దమండ్యం, గుర్రంకొండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో, బైక్ ఢీకొని..



గాయపడిన నాగార్జున

రోడ్డుప్రమాదంలో పెయింటర్ తీవ్రంగా గాయపడిన సంఘటన పుంగనూరు మండలంలో శుక్రవారం జరిగింది. చంద్రమాకులపల్లె పంచాయతీ ఒంటిమిట్ట గ్రామానికి చెందిన నరసింహులు కుమారుడు నాగార్జున (25) మదనపల్లెలో పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. పనులు ముగించుకుని శుక్రవారం రాత్రి ఒంటిమిట్టకు ద్విచక్రవాహనంలో వెళుతుండగా ఎల్లారబైలు సమీపంలో ఆటో బైక్‌ను ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో నాగార్జున తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పుంగనూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన ఆటోను గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని..

కలకడ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ సీటీ స్వామి కథనం మేరకు వివరాలిలాఉన్నాయి. శనివారం రాత్రి చిత్తూరు–కర్నూలు జాతీయరహదారిపై కలకడ మండలం, కె.బాటవారిపల్లె పంచాయతీ బీసీ కాలనీ సమీపంలో స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో పూజారిగా ఉన్న రామయ్యస్వామి వ్యక్తిగత పనులు ముగించుకుని ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయలుదేరాడు. ఇదే సమయంలో బైక్‌లో వస్తున్న కలకడ టౌన్‌కుచెందిన ఖాసీం వెనుక నుంచి ఢీ కొన్నాడు. ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చింతకొమ్మదిన్నె : ఊటుకూరు సమీపంలో గల భారత్ పెట్రోల్ బంకు ఆవరణలోని గదులకు వెనుక భాగాన శనివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి శవం లభించింది. ఈ విషయాన్ని పెట్రోల్ బంకు సిబ్బంది తమ దృష్టికి తీసుకువచ్చారని సీకేదిన్నె ఇన్‌చార్జి ఎస్ఐ ఎన్. రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. పోలీసలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. అతని వద్ద పురుగుల మందు బాటిల్ కొన్నట్లు రశీదు లభించిందన్నారు. మృతుడి ఫొటో తీసి జిల్లా స్థాయిలో వివిధ వ్యవస్థల ద్వారా పరిశీలించగా ఆచూకీ లభించిందన్నారు. చనిపోయిన వ్యక్తి మైదుకూరు మండలం గంజికుంట గ్రామానికి చెందిన చిన్న దండ్లూరు నాగరాజు(30)గా గుర్తించామన్నారు. ఇతను టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం కొనసాగించేవాడన్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు తెలిసిందన్నారు. నాగరాజు మృతికి సంబంధించి కారణాలు తెలియరాలేదని వెల్లడించారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

టైరు పగిలి..అంబులెన్స్ బోల్తా

– మహిళ మృతి : మరో ఇద్దరికి గాయాలు

కడప అర్బన్ : కడప అలంఖాన్‌పల్లెలోని దండు వద్ద జమ్మలమడుగు నుంచి వచ్చిన అంబులెన్స్ ముందు టైరు పగిలి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జమ్మలమడుగు మండలం దేవగుడి గ్రామానికి చెందిన మంగళి లక్ష్మిదేవి (58) మృతి చెందింది. లక్ష్మిదేవి శనివారం వేరుశనగ పంట కోసేందుకు ఉదయం పొలంలోకి వెళ్లింది. అక్కడ పనిచేస్తుండగా గుండెనొప్పి వచ్చింది. ఆమెను చికిత్స నిమిత్తం జమ్మలమడుగులో చేర్పించారు. అక్కడి వైద్యుల సూచనలమేరకు అదే ఆసుపత్రికి చెందిన అంబులెన్స్‌లో కడపకు పంపించారు. సంఘటన స్థలానికి రాగానే టైరు పగిలి అంబులెన్స్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లక్ష్మిదేవి మృతి చెందగా, ఆమె వెంట వచ్చిన బంధువులు సుబ్బరాయుడు, మరో వ్యక్తి గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు.

తొలిదశలో గుర్తిస్తే క్యాన్సర్ నియంత్రణ సాధ్యమే



మాట్లాడుతున్న రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ

కడప అర్బన్ : క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి చికిత్స అందిస్తే నియంత్రణ సాధ్యమేనని కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ఓపి విభాగంలో కళాశాల ఎన్.ఎస్.ఎస్. ఇన్‌ఛార్జ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజు దాసరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, కళాశాల సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ మాట్లాడుతూ రిమ్స్ ఆసుపత్రిలో క్యాన్సర్ ఓపీ బ్లాక్ ప్రారంభమైందన్నారు. అందులో నైపుణ్యం కలిగిన డాక్టర్లు అందుబాటులో ఉన్నారన్నారు. క్యాన్సర్ ఒక మహమ్మారి, కానీ దీనిని తొలిదశలోనే గుర్తించి చికిత్స అందిస్తే నియంత్రణ సాధ్యమేనన్నారు. ఈ కార్యక్రమంలో క్యాన్సర్ వ్యాప్తిపై అవగాహన, నియంత్రణ గురించి పలువురు వైద్యులు ప్రసంగించారు.ప్రజలు క్యాన్సర్ ఓపీ సేవలను వినియోగించుకుని ఆరోగ్యకరమైన జీవితాన్ని జీవించాలన్నారు. కార్యక్రమంలో రిమ్స్ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వరలక్ష్మి, ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, వైద్యులు, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా : డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

అట్లూరు : ఆటో బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ నాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు మండల పరిధిలోని శలంగారిపల్లి గ్రామానికి చెందిన నాగరాజు ఆటో నడపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కడప–బద్వేలు ప్రధాన రహదారిపై రెడ్డిపల్లి సమీపంలో మలుపు తిరుగుతుండగా ఆటో బోల్తా పడింది. నాగరాజుకు తీవ్రగాయాలయ్యాయి.అతన్ని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.